మహిళలు ఒంటరిగా ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై సంధ్య

మధిర పట్టణ ఎస్సై సంధ్య

మధిర, నవంబర్ 7: మహిళలు ఒంటరిగా ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని మధిర పట్టణ ఎస్సై సంధ్య సూచించారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడారు. బంగారు ఆభరణాలు ధరించినప్పుడు, ప్రజలు ఎక్కువగా ఉన్నచోట మీ చుట్టూ ఉన్న వారిపై పూర్తి శ్రద్ధ వహించాలన్నారు. ఒంటరిగా నడుస్తున్నప్పుడు ఫోన్‌లో మాట్లాడటం, డబ్బు, ఆభరణాలను బహిరంగంగా ప్రదర్శించడం వాటిని తీసుకువెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. రాత్రి సమయంలో, పార్కులు, ప్లేగ్రౌండ్‌లు, ఖాళీ స్థలాలు వంటి నిర్జన ప్రాంతాలు ఉండకూడదన్నారు. మిమ్మల్ని ఎవరైనా వెంబడిస్తున్నారనిపిస్తే మీరు ఎక్కువ మంది వ్యక్తులు ఉన్న సమీప ప్రదేశానికి పరుగెత్తి మీ చుట్టుపక్కల ప్రజల సహాయాన్ని పొందాలన్నారు. దాడి జరిగితే 100కు కాల్ చేయాలని సూచించారు.

ముగిసిన 'డీఎస్సీ-2008' సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 7: డీఎస్సీ-2008 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారంతో ముగిసింది. రెండు రోజులుగా ఖమ్మం డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియలో మైదాన, ఏజెన్సీ, ట్రైబల్‌కు సంబంధించిన అభ్యర్థులు హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నారు. ఈ ప్రక్రియను డీఈవో సోమశేఖరశర్మ, ఇతర అధికారులు పరిశీలించారు.

'ప్రభుత్వ విద్య నిర్వీర్యానికే టీచర్లకు కులగణన బాధ్యతలు'

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 7: ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కులగణన బాధ్యతను ప్రభుత్వ ఉపాధ్యాయులకు అప్పగించిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. కులగణన కోసం ఒక్కపూట బడులు నిర్వహించడం ద్వారా విద్యార్థుల చదువుపై పెను ప్రభావం పడుతుందని అన్నారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మంలో గురువారం డీఈవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 750 ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు కులగణనకు వెళ్తే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు శివనాయక్, వంశీరాకేష్, ప్రతాప్, సునీల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రయోగ శక్తి స్త్రీ

మాట్లాడుతున్న కిరణ్ ప్రభు

ఖమ్మం రూరల్, నవంబర్ 7: ప్రపంచ ప్రయోగ శక్తి స్త్రీ అని, స్త్రీ పురుషుడుకంటే చాల బలమైన పాత్ర అని ప్రఖ్యాత సంపాదకుడు, ప్రయోక్తా కిరణ్ ప్రభు అన్నారు. గురువారం మండలంలోని ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 'అన్‌స్టాపబుల్ ఉమెన్ ఐకాన్స్ ఆఫ్ స్ట్రెంత్'పై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. స్త్రీ ఓ కూతురుగా, చెల్లిగా, అమ్మగా, అమ్మమ్మగా అనేక విజయాలు సొంతం చేసుకోవడం జరుగుతుందన్నారు. మహిళలు విద్య, పని ఆరోగ్య సంరక్షణ, కష్టతరమైన హక్కులు ఎదుర్కొంటున్నారన్నారు. అయినప్పటికీ వాటిని ఎంతో ధైర్యంగా ఎదుర్కొంటూ గెలుపు బాటలో పయనించడం సంతోషకరమన్నారు. కళాశాల చైర్మన్ కాట్రపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ బీ గోపాల్, డైరెక్టర్ ఏ వెంకటరమణ, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ఖమ్మం జిల్లా, సత్తుపల్లి పట్టణం & మండలం, నివాసి శ్రీ ఒగ్గు రామిరెడ్డి, తండ్రి. (లేటు) ప్రతాపరెడ్డి గారి సంజాయిషీ పొంది యావన్మందికి యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా!.
నా క్లయింటు తల్లి తండ్రులకు ఒక ఆడ సంతానము పేరు వాణి మరియు ఒక మగ సంతానము ఒగ్గు రామరెడ్డి (నా క్లయింటు) కలరు. నా క్లయింటు సోదరికి వివాహములు చేసి ఆమె వాటాకు ఇవ్వవలసిన ఆస్తులు నా క్లయింటు తల్లిదండ్రుల జీవిత కాలములో ఇచ్చియున్నారు. మరియు ఎంతో వ్యయప్రయాసలతో ఆమెకు మూడుసార్లు వివాహము జరపనైనది.
నా క్లయింటు తల్లిదండ్రులు అనంతరం ఈ క్రింది ఆస్తి నా క్లయింటుకు మాత్రమే చెందవలెనని బంధువుల సమక్షంలో (నా క్లయింటు మరియు వారి తల్లిగారి మధ్య) అంగీకారపత్రము వ్రాసుకోనైనది. నా క్లయింటు తండ్రి ప్రతాపరెడ్డి ఆర్.టి.సి. సత్తుపల్లి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ 2006వ సం.లో మరణించినారు. మరియు నా క్లయింటు తల్లి భారతి గారు ది.02-11-2024వ తేదీన మరణించినారు.
నా క్లయింటుకు తెలియకుండా అతనిని నష్టపరచవలెనని దురుద్దేశ్యముతో ఈ క్రింది ఆస్తిని నా క్లయింటు సోదరియైన పూనూరి వాణి మరియు ఆమె భర్త సుదాకర్‌రెడ్డి తప్పుడు కాగితాలు సృష్టించి నా క్లయింటుకు చెందిన ఈ క్రింది ఆస్తిని దక్కకుండా వారి స్వార్థము కొరకు అక్రమముగా ఇతరులకు అన్యాక్రాంతము చేయవలెనని తలంపుతో ఉన్నట్లు నా క్లయింటుకు తెలియవచ్చినందున నా క్లయింటు సమ్మతి లేకుండా సదరు నా క్లయింటు సోదరిగాని, ఇతరులెవరైనా నా క్లయింటుకు చెందిన ఈ క్రింది ఆస్తిని గురించి ఎటువంటి క్రయ, విక్రయ, గిఫ్ట్, వీలునామా, తనఖా, వగైరా లావాదేవీలు ఇతరులెవరూ నెరపవద్దనియు ఒకవేళ ఇందులకు భిన్నముగా ఎవరైనా వ్యవహరించిన యెడల అటువంటి అక్రమ లావాదేవీలు చట్టప్రకారము చెల్లనేరవని అనియు మరియు నా క్లయింటుకు సదరు ఆస్తిపై వున్న హక్కులకు ఎటువంటి భంగము వాటిల్లదనియూ తెలియజేయుచున్నాము. ఇందులకు భిన్నముగా ఎవరైనా వ్యవహరించిన యెడల నా క్లయింటు తీసుకోబోయే చట్టపరమైన చర్యలకు నా క్లయింటు సోదరి వాణి, మరియు వారితో సదరు ఆస్తుల గురించి ఎటువంటి లావాదేవీలు నెరిపినవారు మాత్రమే జరగబోవు కష్టనష్టములకు బాధ్యత వహించవలసి యుండునని తెలియపరచున్నాము.
ప్రకటన ఆస్తి : ఖమ్మం జిల్లా, సత్తుపల్లి టౌన్ & మండలం, అయ్యగారిపేట రెవెన్యూ, MD హాస్పిటల్ రోడ్డులో సర్వే నెం. 105/Aలో 242 చ||గ||ల నివేశన స్థలము మరియు అందు నిర్మించిన డాబా ఇంటి నెం. 15-206తో సంయుక్తంగా వున్న బాత్రూమ్, కరెంట్ సర్వీస్, మంచినీటి కుళాయి ఆస్తికి హద్దులు : తూర్పు : వెలగలేటి పూర్ణచంద్రరావు గారి ఇల్లు, దక్షిణం : చర్చి, పడమర : మున్సిపాలిటీ రోడ్డు, ఉత్తరం : దారా వెంకటేశ్వరరావు,, వగైరాల ఆస్తి.
మల్లెపూల వెంకటేశ్వరరావు, అడ్వకేట్,
#16-220/1, శ్రీనివాస టాకీస్ రోడ్, సత్తుపల్లి. ఖమ్మం జిల్లా.
సెల్ : 9885282573

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED HELPERS
★హైదరాబాద్ నందు 5 స్టార్ హోటల్‌లో పని చేయుటకు ''హెల్పర్లు'' కావలెను. 12 గంటల డ్యూటీ, 18,000/- జీతం, రూమ్+ఫుడ్ ఫ్రీ. వయస్సు: 18-30 సం||లు.
No Consultency, Direct Job. Contact: 9885283513.
NT-335863_All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

108లో మహిళ ప్రసవం

కూసుమంచి (తిరుమలాయపాలెం), నవంబర్ 7: పురిటి నొప్పులు రావటంతో 108కు ఫోన్ చేయడంతో ఖమ్మం తరలిస్తుండగా మహిళ ప్రసవించడంతో తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లికి చెందిన పందిరి దివ్యకు గురువారం పురిటి నొప్పులు రావటంతో ఖమ్మం తరలించాలని 108కు ఫోన్ చేశారు. సిబ్బంది దివ్యను ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో నొప్పులు ఎక్కువ అవడంతో ఎమర్జెన్సీ టెక్నీషియన్ అంబాల రాణి, లింగయ్య ప్రాథమిక వైద్యం అందించటంతో దివ్య అడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. దివ్యను ఖమ్మం ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం తరలించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **వైరా బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన్వస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కుసిన్ని నరసింహారావు,** S/o: **రోశయ్య, వయస్సు:** 33సం||లు, **నివాసం:** ఇ.నెం. 1-57, ఏన్కూరు గ్రామము మరియు మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయం చుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.
షెడ్యూలు ఆస్తి:1 ఖమ్మం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, వైరా సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలోని ఖమ్మం జిల్లా పరిషత్ ఏన్కూరు మండల పరిషత్, ఏన్కూరు గ్రామపంచాయితీలో చేరిన ఏన్కూరు గ్రామ రెవెన్యూ రికార్డునకు చెందిన గృహసహిత నివేశన స్థలము విస్తీర్ణము : 150.00 చ||గ|| ఇందుకు సరియగు 125.41 చ||మీ|| అందు గల ఇంటి నెంబరు :1-146/3, **డాక్యుమెంట్ :722/2024,** అసెస్మెంట్ నెంబరు : 1741 గా గల గృహమునకు గల విద్యుత్ సర్వీసు మీటరు విద్యుత్ వగైరా ఫిట్టింగ్‌లతో గల గృహము యొక్క వార్షిక అద్దె విలువ రూ. 8,000/- గృహము యొక్క వయస్సు :10సం||లు అట్టి గృహ సహిత నివేశన స్థలమునకు హద్దులు, కొలతలు : **తూర్పు:** గ్రామపంచాయితీ రోడ్డు, **పడమర** : కుసిన్ని రాంబాబు గారి ఖాళీ స్థలము, **ఉత్తరము** : గ్రామపంచాయితీ రోడ్డు, **దక్షిణము :** కాకమాని సత్యవేణి గారి గృహము.
షెడ్యూలు ఆస్తి:2ఖమ్మం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, వైరా సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలోని ఖమ్మం జిల్లా పరిషత్ ఏన్కూరు మండల పరిషత్, ఏన్కూరు గ్రామపంచాయితీలో చేరిన ఏన్కూరు గ్రామ రెవెన్యూ రికార్డునకు చెందిన గృహసహిత నివేశన స్థలము విస్తీర్ణము : 150.00 చ||గ|| ఇందుకు సరియగు 125.41 చ||మీ|| అందు గల ఇంటి నెంబరు :1-146/3, **డాక్యుమెంట్:2954/2024,** అసెస్మెంట్ నెంబరు : 1741 గా గల గృహమునకు గల గృహము యొక్క ఏసిసి నిర్మాణ వైశాల్యం : 440.00 చ||అ|| లు, అట్టి గృహము యొక్క విద్యుత్ సర్వీసు మీటరు విద్యుత్ వగైరా ఫిట్టింగ్‌లతో గల గృహము యొక్క వార్షిక అద్దె విలువ రూ. 8,000/- గృహము యొక్క వయస్సు :10సం||లు అట్టి గృహ సహిత నివేశన స్థలమునకు హద్దులు, కొలతలు : **తూర్పు:** గ్రామపంచాయితీ రోడ్డు, **పడమర :** కుసిన్ని రాంబాబు గారి ఖాళీ స్థలము, **ఉత్తరము :** 10 అడుగుల వెడల్పు గల దారి, **దక్షిణము :** కాకమాని సత్యవేణి గారి గృహము.
జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

సమగ్ర సర్వే తప్పులు లేకుండా చేయాలి: ఆర్డీవో

సత్తుపల్లి: మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్, బోనకల్లు: మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నంచందర్, ముదిగొండ: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీధర్‌స్వామి

సత్తుపల్లి, నవంబర్ 7: సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యూమరేటర్లు తప్పులు లేకుండా నిర్వహించాలని ఆర్డీవో రాజేంద్రగౌడ్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో వారికి కేటాయించిన బ్లాక్‌ల్లో గృహాలను గుర్తించి ఇంటికి కుడివైపున స్టిక్కర్లు అంటించాలన్నారు. ప్రాథమిక సర్వే పూర్తిచేసి శనివారం నుంచి పూర్తిస్థాయిలో ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందన్నారు. కుటుంబ వివరాలు నమోదు చేసేందుకు ప్రభుత్వం కోడ్ నెంబర్లతో రూపొందించిన పుస్తకాలు అనుసరించి కుటుంబ వివరాల షెడ్యూల్ ఫారంలో నమోదు చేయాలన్నారు. తహసీల్దార్ యోగేశ్వరరావు, డీఎస్‌వో శ్రీకాంత్, కల్లూరు ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, ఏఎన్‌వోలు జ్యోతి, సంపత్, అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పక్కాగా నిర్వహించాలి

ముదిగొండ, నవంబర్ 7: కుటుంబ సర్వేను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీధర్ స్వామి అన్నారు. స్థానిక రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన ఎన్యూమరేటర్లకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వే బుక్‌లెట్‌లో ప్రతి ప్రశ్నకు జవాబును కోడ్ రూపంలో రాయాలని అన్నారు. ప్రతి ప్రశ్నను అర్థమయ్యేలా చెప్పి వారి చెప్పిన వివరాలు మాత్రమే నమోదుచేయాలని అన్నారు. గ్రామాల నుంచి వలస వెళ్లిన వారు సర్వే వరకూ వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో కిశోర్, ఎంఈవో రమణయ్య, ఆర్ఐ వహీద తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో అదనపు ఎన్యూమరేటర్ల ఏర్పాటు

బోనకల్లు, నవంబర్ 7: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం అదనపు ఎన్యూమరేటర్లను నియమిస్తున్నట్లు తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సర్వే సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులుగా కుటుంబ సర్వేలో ప్రతిఒక్క ఎన్యూమరేటర్ 150 నుంచి 175 ఇళ్లను సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కానీ స్టిక్కర్లు అందించిన తర్వాత కుటుంబాలు పెరగడంతో వారి కోసం మరి కొంతమంది ఎన్యూమరేటర్లను తీసుకొని సర్వే నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రురావత్ రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

వేంసూరు, నవంబర్ 7: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని తహసీల్దార్ ఎంఏ రాజు అన్నారు. గురువారం వేంసూరులో జరుగుతున్న సమగ్ర సర్వే స్టిక్కరింగ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో 26 గ్రామపంచాయతీలు ఉండగా 101 బ్లాక్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. సర్వేకు 102 మంది సిబ్బందిని నియమించామని, మండలంలో 13,916 నివాస గృహాలు, 35 వేల మందికి పైగా ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి'

వేంసూరు, నవంబర్ 7: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద బాబు అన్నారు. మండలంలోని చౌడవరం గ్రామంలో సాయిగణేశ్ గ్రామసమాఖ్య ఆధ్వర్యంలో పెంచిన సోనాలి, ఆశీల్ జాతికి చెందిన పెరటికోళ్లను గురువారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. సాయిగణేశ్ గ్రామసమాఖ్య ఆధ్వర్యంలో ఈ రెండు జాతులకు చెందిన పిల్లలను పెంచుతున్నారన్నారు. 20 పిల్లలు కలిపి ఒక యూనిట్‌గా అమ్మడం జరుగుతుందని, సోనాలి జాతికి చెందిన 20 పిల్లల ధర రూ.2,800, ఆశీల్ జాతికి చెందిన యూనిట్ ధర రూ.2,100 అమ్మడం జరుగుతుందని తెలిపారు. పెరటి కోళ్లు సంవత్సరానికి 200 గుడ్లు పెడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ సత్తుపల్లి ఏపీఎం సుబ్బారావు, సీసీలు ప్రసాద్, చెన్నారావు, షబ్బీర్, భాస్కర్, వీవోఏ పసుమర్తి సత్యనారాయణ, గుగులోత్ రాధాకృష్ణ, అరెంపుల ప్రసాద్, సురేఖ, వహీద, లక్ష్మి, ఫైజుద్దీన్, పుచ్చకాయల సోమిరెడ్డి, రమేశ్, భాను పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లలో లోపాలుంటే సరిచేయాలి

అధికారుల సమీక్షలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

మామిళ్లగూడెం, నవంబర్ 7: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని తెలంగాణ ఉత్తరమండల విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ లైన్లలో లోపాలు ఉంటే వెంటనే వాటిని సరిచేయాలని సూచించారు. ఖమ్మం టీటీడీసీ మీటింగ్ హాల్లో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ అంతరాయాలను తగ్గించాలని, విద్యుత్ ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, వ్యవసాయ సర్వీసులను వెంటనే మంజూరు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనిచేయాలని సూచించారు. డీటీఆర్ ఫెయిల్యూర్‌లను తగ్గించి వెంటనే ఫెయిల్ అయిన వాటిని డిపార్ట్‌మెంట్ వాహనాల్లో ట్రాన్స్‌పోర్టు చేయాలని ఆదేశించారు. అలాగే, బిల్లుల వసూళ్లను పెంచాలని సూచించారు. కాలిపోయిన, ఆగిపోయిన మీటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పొలంబాట కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా చేపట్టి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయాలని కోరారు. అనంతరం జిల్లా విద్యుత్ కార్మికుల అవగాహన సదస్సులోనూ మాట్లాడారు. విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా 'విద్యుత్ భద్రత - అవినీతి నిరోధకం'పై అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జి డైరెక్టర్ మధుసూదన్, అధికారులు అశోక్‌కుమార్, సదర్‌లాల్, కిషన్, సురేందర్ పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తి డీఏవీలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వజ్రోత్సవ వేడుకలు

ర్యాలీ నిర్వహిస్తున్న డీఏవీ విద్యార్థులు

సత్తుపల్లి, నవంబర్ 7: స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థాపించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి డీఏవీ స్కూల్‌లో గురువారం వజ్రోత్సవ వేడుకలు నిర్వహించారు. స్కౌట్స్ మాస్టర్ ఏ వాసుదేవరావు సంస్థ చరిత్రను, ఉద్దేశ్యాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం సత్తుపల్లిలో 300 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం శేషసాయిశ్రీ, ఎంఈవో నక్కా రాజేశ్వరరావు మాట్లాడుతూ ఆ సంస్థ ద్వారా విద్యార్థుల్లో సేవాగుణం, అంకితభావం, దేశభక్తి పెంపొందుతాయన్నారు. విద్యార్థులను సాయిస్ఫూర్తి చైర్మన్, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి, డీఏవీ ఏపీ జోన్ రీజినల్ ఆఫీసర్ జీఆర్‌కే ప్రసాద్, సాయిస్ఫూర్తి కళాశాల చైర్మన్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద, సాయిస్ఫూర్తి ప్రిన్సిపాల్ శేషరత్నకుమారి అభినందించారు.

సాయిస్ఫూర్తిలో స్పైడర్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ రిక్రూట్‌మెంట్

ప్లేస్‌మెంట్లకు హాజరైన విద్యార్థులు

సత్తుపల్లి, నవంబర్ 7: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం స్పైడర్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఎస్ఆర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ డ్రైవ్‌లో భాగంగా బెంగుళూరు వారిచే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించారు. కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న అన్ని బ్రాంచ్‌లకు చెందిన 183మంది విద్యార్థులు హాజరయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు డీఏన్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈఇంటర్వ్యూలో గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్ రౌండ్, హెచ్ఆర్ ఇంటర్వ్యూల ద్వారా 28 మంది విద్యార్థులను ఎంపిక చేశామని ఆ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్లు ప్రతిభ, ఐశ్వర్య అన్నారు. వీరికి ఏడాదికి రూ.3.6 నుంచి రూ.5.50 లక్షల వరకు వేతనం ఇస్తామని పేర్కొన్నారు. వీరిని ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి, హెట్రో చైర్మన్, ఎంపీ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, అన్ని బ్రాంచ్‌ల అధిపతులు అభినందించారు.

మెస్‌చార్జీల పెంపు హర్షణీయం

కొణిజర్ల, నవంబర్ 7: రాష్ట్రంలోని గురుకుల హాస్టల్ విద్యార్థుల మెస్‌చార్జీల పెంపు పట్ల తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర కళాశాల ఖమ్మం టీజీఎంఆర్ఎస్ అండ్ జేసీ ప్రిన్సిపాల్ ఎల్ జితేశ్ షాహిల్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెంచిన చార్జీలు విద్యార్థులకు మంచిగా సరిపడా పౌష్టికాహారం అందుతుందన్నారు. మెస్, కాస్మోటిక్ చార్జీల పెంపు పట్ల కళాశాల, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ కే కొండల్ రావు, పాఠశాల కో ఆర్డినేటర్ శ్రీవిద్య, లెక్చరర్లు అనిల్, క్రాంతికుమార్, పీడీ రవికుమార్, వార్డెన్ యాకుబ్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్

కూసుమంచి (నేలకొండపల్లి), నవంబర్ 7: చెరువుమాధారం ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు పోటీ పరీక్షలు చిన్నప్పటి నుంచే అలవరచుకోవటం వల్ల మంచి విజ్ఞానం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉజ్వల, అరవింద్, కల్పన, వేణు, మంగేశ్వరి, శ్రీనివాసరావు, ప్రసాద్, రంగయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

10నుంచి వైరాలో జోనల్ క్రీడలు

మాట్లాడుతున్న స్వరూపరాణి

వైరాటౌన్, నవంబర్ 7: ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జోనల్‌క్రీడలు వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరుగనున్నాయని జోనల్ అధికారి కొప్పుల స్వరూపరాణి తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 20 పాఠశాలల విద్యార్థినిలు పాల్గొంటున్నారని, బాలికలకు వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో, బాలురకు సంబంధించి మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాలో జోనల్ క్రీడలు జరుగుతాయని తెలిపారు. అండర్-14, 17, 19 విభాగాల్లో ప్రతి సెంటర్ నుంచి 85 మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. వైరాలో జరిగే క్రీడల్లో 1199 మంది విద్యార్థినిలు, 28 పీడీపీలు పాల్గొంటున్నారని అన్నారు. వసతుల పరిరక్షణ కోసం 11 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. తొలిరోజు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారన్నారు. క్రీడల ముగింపు కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొని విజేతలకు బహుమతులు అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీవో వరలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ సమత, సూపరింటెండెంట్లు సంజీవరెడ్డి, సాయికిరణ్, డీ సైదులు, జీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చేగొమ్మ ఎస్ఆర్ఎస్పీ కాలువ పనులకు మోక్షం

కూసుమంచి, నవంబర్ 7: మండలంలోని చేగొమ్మ గ్రామంలో ఎస్ఆర్ఎస్పీ స్టేజ్-2 54 ప్యాకేజీలో 1ఎల్/29ఆర్ మైనర్‌లో కాలువ బ్యాకింగ్ మట్టి పోసి కాలువ పనుల పునరుద్ధరణతోపాటు కాల్వపై పెండింగ్‌లో ఉన్న దారికి మోక్షం కలిగింది. ఈ పనులతో 4,277 ఎకరాలకు ఉపయోగం కానుంది. అదేవిధంగా కాలువపై రహదారితో చేగొమ్మ, కొండాపురం, ఎర్రగడ్డ ప్రాంతాల రైతులకు లాభం చేకూరనుంది. చేగొమ్మ రైతులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సమస్యలను వివరించడంతో సంబంధిత గుత్తేదారుతోపాటు అధికారులు, క్యాంపు ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొండపర్తి సురేశ్ రైతులతో చర్చించి వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపారు.

డిప్యూటీ సీఎంను కలిసిన అదనపు కలెక్టర్

డిప్యూటీసీఎంకు పూలమొక్కను అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

మధిర, నవంబర్ 7: చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను జిల్లా అదనపు కలెక్టర్ పీ శ్రీనివాసరెడ్డి గురువారం కలిసి పూలమొక్కను అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్‌గా పనిచేసిన మధుసూదన్‌నాయక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో పీ శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

ఏఎంసీలో క్రయవిక్రయాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

క్రయవిక్రయాల తీరును అదనపు కలెక్టర్‌కు వివరిస్తున్న సెక్రటరీ ప్రవీణ్‌కుమార్

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 7: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని పత్తియార్డులో జరుగుతున్న క్రయవిక్రయాలను అదనపు కలెక్టర్ (ఏసీ) పీ.శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. స్థానిక పత్తియార్డుకు గురువారం మధ్యాహ్నం చేరుకున్న ఆయన.. విక్రయం నిమిత్తం రైతులు తెచ్చిన పత్తిని పరిశీలించారు. అలాగే, దానిలో తేమ శాతాన్ని నిర్ధారించే యంత్రాలను కూడా పరిశీలించారు. ధరల వ్యత్యాసాలను గమనించారు. రైతులు అధిక ధర పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక అధికారులకు, రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్ యార్డులో ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు కార్యకలాపాలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, పర్యవేక్షకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌బీ ఏసీపీగా రవీందర్‌రెడ్డి

మామిళ్లగూడెం, నవంబర్ 7: రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీ, ఏసీపీ స్థాయి పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ డీజీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా ఖమ్మం సీసీఆర్‌బీలో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న డీ.ప్రసన్నకుమార్‌ను మెదక్ డీఎస్పీగా బదిలీ చేశారు. ఆ స్థానంలో నిర్మల్ డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తూ పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న పీ.రవీందర్‌రెడ్డిని ఖమ్మం సీసీఆర్‌బీలో నియమించారు. ఉత్తర్వులు అందుకున్న అధికారులు వెంటనే వారి స్థానాల్లో విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

అన్నం ఫౌండేషన్‌కు రూ.లక్ష సరుకులు వితరణ

బియ్యం, సరుకులు అందజేస్తున్న సింగరేణి ఉద్యోగులు

రఘునాథపాలెం, నవంబర్ 7: భద్రాద్రి కొత్తగూడెనికి చెందిన పద్మావతి బొగ్గు బావి అధికారులు, సిబ్బంది ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు రూ.లక్ష విలువైన బియ్యం, వంట సరుకులు వితరణ చేశారు. మానసిక వికలాంగులకు అన్నం ఫౌండేషన్ అందిస్తున్న సేవల గురించి సింగరేణి ఉద్యోగులు తెలుసుకొని చలించిపోయారు. ఈ క్రమంలో పద్మావతి గనికి చెందిన 800 మంది కార్మికులు రోజుకు రూ.50 చొప్పున వెచ్చించి రూ.లక్ష సమకూర్చారు. ఈ మొత్తంతో బియ్యం, సరుకులు సేకరించారు. వీటిని ఖమ్మంలోని ఫౌండేషన్‌లో చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కడివెండి వేణుగోపాల్‌లకు గురువారం అందజేశారు. దీంతో ఫౌండేషన్ బాధ్యులు.. వీరికి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. సింగరేణి అధికారులు షాలెం రాజు, రవీందర్, పాలడుగు శ్రీనివాస్, శ్యాప్రసాద్, హరీశ్ పాల్గొన్నారు.

'కులగణనను నిష్పక్షపాతంగా చేపట్టాలి'

రఘునాథపాలెం, నవంబర్ 7: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనను నిష్పక్షపాతంగా నిర్వహించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ కోరారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సర్వే పూర్తయిన వెంటనే ఆ వివరాలను అధికారికంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో ఈ సర్వే ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అంతేగాక ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్ఎస్‌టీ (సంచార జాతులు) సర్టిఫికెట్‌ను యాదవులకు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సర్వేకు బీసీలు సహకరించాలని కోరారు. సంఘం బాధ్యులు చిలకల వెంకటనర్సయ్య, చిత్తారు సింహాద్రి యాదవ్, పొదిల సతీశ్, సత్తి వెంకన్న, వాకదాని కోటేశ్వరరావు, పొదిల భూపతి, కంకు వెంకటేశ్ పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో లాభాలు

కూసుమంచి, నవంబర్ 7: రైతులు వేస్తున్న పంటలకు కాకుండా పామాయిల్ వేస్తే మంచి లాభాలు వస్తాయని మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి అన్నారు. గురువారం మండలంలోని మునిగేపల్లిలో జరిగిన పామాయిల్ సాగు అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తక్కువ నీటి వసతితోపాటు ఎక్కువ ఆదాయం వచ్చే విధంగా పామాయిల్ సాగు ఉందని, ప్రభుత్వం పామాయిల్ రైతులను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రవీందర్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకుకు గాయాలు

పెనుబల్లి, నవంబర్ 7: మండలంలోని వీఎం బంజర సోమ్లానాయక్‌తండా వద్ద ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తల్లి, కొడుకుకు గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. మూల్పూరుతండా నుంచి లంకపల్లి వైపు తల్లి, కొడుకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వీఎం బంజరలోని సోమ్లానాయక్ తండా వద్ద రోడ్డుపై ఉన్న గుంతలో పడడంతో తల్లి సోనా తీవ్రంగా గాయపడింది. ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

తోపుడుబండి సాధిక్‌అలీ మృతి

సాధిక్‌అలీ(ఫైల్)

పెనుబల్లి, నవంబర్ 7: కల్లూరు పట్టణానికి చెందిన తోపుడు బండి అధినేత సాధిక్‌అలీ గురువారం గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు, సామాజిక వేత్తలు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు నివాళి అర్పించి, కుటుంబసభ్యులను తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాధిక్‌అలీ భౌతికకాయాన్ని విద్యార్థులు సందర్శించి నివాళి అర్పించారు. సాధిక్‌అలీ తోపుడుబండి అనే ఓ సేవాసంస్థను స్థాపించి ఆ తోపుడుబండినే ఇంటిపేరుగా మార్చుకున్నారు. ఆయన ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు సాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

ఉరివేసుకొని వృద్ధుడు ఆత్మహత్య

సత్తుపల్లిటౌన్, నవంబర్ 7: ఉరివేసుకొని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పట్టణంలోని పాత ఎన్టీఆర్ కాలువ ఒడ్డున నివాసం ఉంటున్న అరవపల్లి అమరయ్య(75) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురై ఇంటికి సమీపంలోని ఓ పాకలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య రాములమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సత్తుపల్లి సీఐ టీ కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాతా ముత్యంకు నివాళి

ముత్యం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కొణిజర్ల, నవంబర్ 7: మండలంలోని సింగరాయపాలెం గ్రామానికి చెందిన తాతా ముత్యం ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు గురువారం మృతుడి చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపా రు. నివాళి అర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు రాయల పుల్లయ్య, మాజీ సర్పంచ్ మట్టా శ్రీను, లక్ష్మీపురం మాజీసర్పంచ్ అమ్మిక రామారావు, మట్టా వెంకటేశ్వర్లు, శ్రీను ఉన్నారు.

తాతా రంగారావుకు నివాళి

రంగారావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న లింగాల కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు

వైరారూరల్, నవంబర్ 7: మండలంలోని తాటిపూడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, వైరా సొసైటీ మాజీ చైర్మన్ తాతా రంగారావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం జరిగిన రంగారావు దశదిన కర్మకు జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు హాజరై రంగారావు చిత్రపటానికి నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగాల రవికుమార్, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, తాటిపూడి మాజీ సర్పంచ్ భట్టా పెద్ద భద్రయ్య, బండి కోటయ్య, బాబు తదితరులు ఉన్నారు.

నాచేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కూసుమంచి(నేలకొండపల్లి), నవంబర్ 7: నేలకొండపల్లి మండలం నాచేపల్లి, ముజ్జుగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాచేపల్లి సొసైటీ చైర్మన్ తన్నీరు సత్యనారాయణ గురువారం ప్రారంభించారు.